# ఖర్మ

నరసింహం, సాధువు, ఇంట్లో! పూజలు, పుణ్యకార్యాలు, భజనలు, పాద పూజలు, అతిధి, అభ్యాగతులయందు ఆదరణగలవాడు.

ఉదయం సంధ్యావందనం తప్పకుండా చేస్తాడు.

విభూతి ధరిస్తాడు కుంకుమాక్షతలు చల్లుకుంటాడు.

పటికరాయిలా వుంటాడు పట్టుపంచె కట్టుకుంటే! సూటుబూటువేస్తే, శాప గ్రస్తుడైన దొరలావుంటాడు.

మెల్లగానె మాట్లాడతాడు, పెళ్ళాంతోటి, పనిమనిషితోగూడ.

నరసింహానికి దిగుళ్ళు, ఈతిబాధలు లేవు, వయసు మీదబడుతున్నదే అన్న యావ తప్ప!

డబ్బుకు లోటు లేదు, పిత్రార్జితం ఖర్చుపెట్టకుండా, సంపాయించేపోస్ట్‌లో పడటంవల్ల.

దురలవాట్లులేవు, క్యాంపుకెడితేతప్ప

అయన నడుస్తుంటే, ఆపుని అప్పుడే బ్రేక్‌ఫాస్ట్‌చేసిన పులిలావుంటాడు. ఆవులిస్తే భుక్తాయసంతో వున్న సింహంలానూ వుంటాడు.

నరసింహానిది క్రమబద్ధమైన జీవితం మొదటినుంచీ!

కళ్ళు తెరుస్తూనే 'కృష్ణ. కృష్ణ' అనుకుంటాడు, 'శ్రీరామ' అని అరచేతిలో వ్రాసుకుని కళ్ళకద్దుకుంటాడు.

కాలకృత్యాలు, తీర్చుకున్నాక రెండు బక్కెట్ల నీళ్ళతో స్నానంచేసి, ఆపైన పూజలో కూర్చుంటే ఓ గంట !

వెండిగ్లాసుతో కాఫీ పుచ్చుకుంటూ, కాస్సేపుదినపత్రికలో దేశ, విదేశ వార్తలు అలా అలా చూసేసరికి, వడ్డన పూర్తవుతుంది. నింపాదిగా భోజనం చేసి, కాస్సేపు విశ్రమించేసరికి, ఆఫీసు కారు సిద్ధం. రెండు ఫైళ్ళు, ప్యాను తీసుకొస్తే, నరసింహం అతి నింపాదిగా కారెక్కుతాడు, గర్భిణీ స్త్రీ లాగా!

. ఇక ఆఫీసులో అడుగు పెట్టిందగ్గర్నుంచీ కళ్ళతో కాల్చుకుతింటాడు. పెన్నుతో వెన్నుపోటు పొడుస్తాడు. నవ్వుతూ నిలువునా చంపేస్తాడు.

పనిమీదొచ్చిన ప్రజానీకం, పైరవీకొచ్చే నాయకులు, పనిచేసే గుమాస్తాలు ఆయన ఎదురుగా నిలబడితే,

మంచుగుహలో కెళినట్లు, పక్షవాతం వచ్చి రెండు చేతులు, కాళ్లూకాక, నోరు కూడా పడిపోయినట్లు అయిపోతారు. ఫైలు చూసి తలెత్తితే, పరమ శివుడు త్రినేత్రం తెరచినట్లు, నవ్వితే కరెంటు షాక్ తగిలినట్లు సంతకం పెట్టి ఫైలు చేతికిస్తే పులివాసన చూసి వదిలేసినట్లు ఫీలవుతారు.

నరసింహం కింద పనిచేసేవాళ్ళు లంచం తీసుకోరు. పనికి బద్ధకించరు. ఆఫీసు వేళలో స్వంత పనులమీద పోరు. అంత భయం!

నరసింహానికి ప్రభుత్వంలో మంచి పేరుంది, గట్టివాడని, నిజాయితీ పరుడనీనూ.

అలాంటి నరసింహం ఆఫీసులో, సుజాతకు ఇంటర్వ్యూ వచ్చింది.

సుజాత ఎవరంటే-

ఆరుగురు చెల్లెళ్ళకు, ఇద్దరు తమ్ముళ్ళకూ పెద్దది. బడిపంతులుచేసి, పింఛను సెటిల్ కాని సుబ్బారావు పెద్ద కూతురు.

సుజాత బియస్సీ మాత్రమే చదువుకుంది, యంఎస్సీ చదివేందుకు కోరిక వుండి, డబ్బులేక.

టైపు ప్యాసయింది, షార్ట్ హాండ్ నేర్చుకుంది.

సన్నగా, ఎర్రగానూ వుంటుంది. పరకాయించి పరీక్షగా చూస్తే మళ్ళీమళ్ళీ చూడాలనీ అనిపిస్తుంది. చూశాక సుజాత అందమైంది సుమా అని కూడా అనిపిస్తుంది. వయస్సు రాని వాళ్ళకూ, వచ్చినవాళ్ళకూ !

సుజాతకు వివాహం కావాలి. ఆమె తండ్రికి, సుజాతకు ఉద్యోగం వస్తే బాగుండు అన్న కోరికావుంది.

సుజాత, సుబ్బారావూ, నరసింహాన్ని ఇంటిదగ్గర కలిశారు. తమ పరిస్థితి, ఉద్యోగం ఇప్పిస్తే, నరసింహానికి జమఅయ్యే పుణ్యం ఎంతో దీనంగా చెప్పారు. ప్రార్థించారుకూడ.

నరసింహం చెప్పింది విన్నాడు. నరసింహం భార్య సుభద్రమ్మ, 'పాపం! ఎంతో ఆశపడి వచ్చారండి. ఎలాగైనా ఉద్యోగం ఇప్పించండి!' అని అన్నది.

నరసింహం ఉలకలేదు. పలకలేదు. సుజాతనే చూస్తూవుండిపొయ్యాడు.

సుభద్రమ్మ "అయన చేతనైంది చేస్తారులేమ్మా" అనంది.

సుజాత వచ్చేసింది. సుబ్బారావు, ఆమె మాటలకు ఏనుగెక్కాడు.

ఉన్నంతలో మంచిచీర, దొడ్లోపూచిన ఎర్రగన్నేరు పూలు, ప్లాస్టిక్ చెప్పులు ఉన్న సర్టిఫికెట్లు పట్టుకుని సుజాత, ఇంటర్వ్యూకి బయలుదేరింది.

సుజాత వర్జ్యంలేకుండా, పెద్ద ముత్తయిదువ శకునంరాగా, భగవంతుడిని మనసులో తలుచుకుని మరీ బయలుదేరింది.

ఉన్నది ఒక్కపోస్ట్.

వచ్చింది ఎక్కువమంది పోస్ట్‌గ్రాడ్యుయేట్లూ, పి హెచ్ డీలూ.

వందమంది ఆశతోనేవున్నారు, తమకే ఆఉద్యోగం వస్తుందని, రావాలనీ!
నరసింహానికి, ఆరోజు మనస్సు బాగోలేదు; అంటే జబ్బేంగాదు.

సుజాత ఎర్రటి పెదవులు, నున్నటి బుగ్గలు, కాటుకదిద్దుకున్న కళ్ళూ బాల్ పాయింట్ పెన్‌లాంటిముక్కూ, నరసింహం కళ్లముందు మెదులుతూ వున్నాయి.

"పెళ్లయిందా ?" అన్నప్పుడు సుజాత నవ్విన నవ్వు నరసింహానికి కరెంట్ షాక్‌లా తగిలింది. ఆ దెబ్బనుంచి ఆయన తేరుకోలేదు. కోలుకో లేదు. వళ్లు కాక ఎక్కిందికూడా !

ఉద్యోగం ఎవర్ని వరిస్తుందో అన్న నిర్ణయం తర్వాత తెలుపుతామన్నారు. ఆశావాదులు వెళ్లిపోయారు ఇళ్ళకు. సుజాతా వెళ్ళింది. బరువెక్కినగుండెలతో!

"ఉద్యోగం నీకిస్తే నాకొచ్చేలాభం?"

సుజాతకు ఆ ప్రశ్నకు సమాధానం తోచలేదు. బెదురుగా నరసింహాన్ని చూసింది.

నరసింహం నిజంగా సింహం ఆఫీసులో! పేపర్ వెయిట్‌ని ఆ చేతిలోంచి ఈ చేతిలోకి మార్చుకుంటూ పదేపదే "సుజాతా! ఒక్కరాత్రి నీతో గడపాలని వుంది. ఇష్టమైతే, ఉద్యోగం నీకే కావాలనుకుంటే శుక్రవారం రింగ్‌రోడ్‌లో వున్న నాతోటకురా!" అన్నాడు నరసింహం! కట్టుడు పళ్ళు నాలుకతో సర్దు కుంటూ.

సుజాత ఆలోచిస్తూనే వుంది. అన్నం తింటూ, నిద్రపోతూ, ఇంట్లోపనులు చేస్తు రాత్రీ, పగలూ? ఇది వరమా! శాపమా అని!

నరసింహం కూడా ఆలోచిస్తూనే వున్నాడు—ఆఫీసులో, యింట్లో నిద్ర పోతూనూ, నిద్ర రానప్పుడూనూ—

నరసింహం నలుగురు కొడుకులకూ, ఇద్దరు కూతుళ్ళకూ తండ్రీ. నలుగురు కోడళ్ళకూ, ఇద్దరు అల్లుళ్ళకూ మామ! పదిమంది మనవలకు తాత!

నరసింహానికి జీవితం, వడ్డించిన విస్తరి.

ఆస్తి వుంది. ఆఫీసులో సంపాదనా వుంది.

పిల్లలు ఎక్కొచ్చారు. ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

భార్య వుంది, ఆమెకు ఉబ్బసమూ వుంది.

నరసింహానికి బీపీకూడ వుంది.

కనుసైగచేస్తే తారామణులను సహితం తార్చేందుకు సిద్ధంగా వున్నారు! పెదాలు చప్పరిస్తే చాలు పెగ్గులకొద్దీ తాపించగల సమర్థులూ వున్నారు. మరి నరసింహం సుజాతనే కోరుకున్నాడు ఎందుకూ? ఎందుకూ?

నరసింహం ఆఫీసులో చేరిందగ్గర్నుంచే బుద్ధిమంతుడు, యోగ్యుడు. అన్న కీర్తికోసం పెద్దల అడుగులకు మడుగులొత్తాడు. ఎందర్నో తలదన్ని ఒక్కో మెట్టూ ఎక్కుతూ పైకొచ్చాడు. జీవితం అంతా ఆఫీసుకు ముడెట్టేశాడు. అప్పుడే పిల్లలు పుట్టుకొచ్చారు. పెద్దవాళ్ళు అయ్యారు, ఆయన ప్రమేయం లేకుండానే!

'హమ్మయ్య' అని నరసింహం అనుకునేసరికి వయస్సు సగానపడ్డది. జుత్తు వూడిపోయింది. ముందర రెండు బంగారపు పళ్ళు వచ్చాయి. భార్యకు చాదస్తం, దాంతో ఉబ్బసమూ ఎక్కువైనాయి.

నరసింహం మొహంవాచి వున్నాడు దేనికి?

క్యాంపుల్లో తీర్చుకునే సరదాలు, చేసేసయ్యాటలూ, రూల్ ప్రకారం చెయ్యటం, స్వేచ్ఛలేదు. ఎవడన్నా పిటీషను పెడతాడేమోనన్న భయంగూడ వుంది. పైగా బయట దొరికేది అంతా అడవాసరుకు కక్కుర్తితప్ప సుఖం తక్కువ! సేఫ్టీ మరీ తక్కువ!

అందుకే సుజాతను కోరుకున్నాడు.

సుజాత ఏమంటుంది? అన్న జిజ్ఞాసతో చిక్కి సగమైనాడు ఏకాదశీ వ్రత దీక్షలోవున్న నక్కలా నీలుక్కుపొయ్యాడు.

సుభద్ర "ఏమిటలావున్నారూ" అని పరామర్శించింది. చలిజ్వరం వచ్చిన వాడిలా వున్న భర్తను.

నరసింహం సిగ్గుపడ్డాడు. ఆ తర్వాత "వంట్లో నలతగావుంది—వీలయితే తోటకెళ్ళి రెస్ట్ తీసుకోవాలి" అన్నాడు బధ్ధకంగా.

"తప్పకుండా వెళ్ళండి  నేను చిన్నదాన్ని చూసి రెండ్రోజుల్లో వస్తా" అనంది.

రోగి బీరు కోరాడు. డాక్టరూ అదే తీసుకోమన్నట్టు నరసింహానికి ఇంట్లో అడ్డంకి తీరింది. ఆఫీసుకార్లో భార్యను వూరికి పంపాడు.

ఇక సుజాత?

వొప్పుకుంది!

కూడు, గుడ్డ, భద్రత ఇవ్వని శీలానికంటే ఉద్యోగం ముఖ్యం! అదుంటే మొగుడొస్తాడు. కూడు దొరుకుతుంది. వీధిలో పరువు దొరుకుతుంది. ఆడపిల్ల అయితేనేం తండ్రిని ఆదుకుంది అన్న పేరూ మిగులుతుంది.

శుక్రవారంనాడు నరసింహం ఉడుకులాం వేసుకుని వేణ్ణీళ్లపోసుకున్నాడు. ఫ్రెంచిదేశపు రాజకుటుంబీకులువాడే సెంటు వ్రాసుకున్నాడు. పొందూరు ఖద్దరు పంచ, పట్టులాల్చీ ధరించి, కార్యపు పెళ్ళికొడుకులా తాయారయి తోటకెళ్ళాడు ఈలవేసుకుంటూ.

తోటకు కాపలావుండే గురవయ్యకు పని పురమాయించి, హుషారుగా

తోటంతా తిరిగాడు.

చెట్టు చెట్టునూ పలకరించాడు. పిట్టలనూ పూలమొక్కలనూ చూసి పులక రించాడు. "ఆహా జీవితమే........" అనీ పాడుకున్నాడు. ఈలగూడవేశాడు.

హుషారు పాదరసంలా వళ్ళంతా ప్రాకింది. యౌవ్వనం వచ్చింది. పాలిన పెదవులపై చిరునవ్వూ వచ్చింది.

చీకటి పడేదాకా పచార్లు చేశాడు. పడుకున్నాడు. కూర్చున్నాడు. ఓసారి పిల్లిమొగ్గేద్దామా అనుకున్నాడు. సరదాగా అయినా విరమించుకున్నాడు. వయస్సు గుర్తుకొచ్చీ, నడుంనొప్పి జ్ఞాపకంవచ్చీ !

చిరుచీకటి ముసురుకునేవేళ, సుజాత వచ్చింది- గుర్తుకు ! ఊహకు.

సుజాత అనాఘ్రాతపుష్పం ! మొగ్గ ! బంగారు శలాకలా వుంది. నరసింహం ఆబగా వాటేసుకున్నాడు. ఆమె వళ్ళు వెచ్చగా వుంది. గమ్మత్తుగా వాసనా వేసింది.

'ఐలవ్ యూ ! సుజాతా !' అన్నాడు అన్నప్పుడు, గొంతులోని కరుకు తనానికి నరసింహానికే రోత పుట్టింది. వళ్ళంతా, నగ్నంగా వున్న సుజాత వళ్లంతా నిమిరాడు ముద్దు పెట్టుకున్నాడు.

సుజాత ముడుచుకుపోయింది! బాధతో, సిగ్గుతో కుచించుకు పోయింది. ఆమె మల్లె పువ్వు. నరసింహం ఆబోతు నలిపేశాడు ఆమెను. ఆశగా. ఆత్రంగా కొరికాడు కసిగా- నవ్వుకున్నాడు గర్వంగా!

నరసింహం వంట్లోని నెత్తురు ఉప్పె నొచ్చినట్లు, నరనరాల్లో పరుగు లెత్తింది, నరాలు ఉబ్బాయి, మొహంలో నెత్తురు పోటులా వచ్చి, కళ్ళు అగ్ని కణాల్లా ఎరుపెక్కాయి. పెదాలు వణికాయి.

ఓహ్ ! ఎంతానందం !

స్వర్గారోహణ చేసినట్లు సుజాత అందాన్నంతా జుర్రుకున్నాడు. దేహ మంతా పులకింత కలిగింది.

నరసింహం బోనులోంచి అడవినపడ్డ సింహంలా అయ్యాడు ఉత్సాహంతో, ఉద్రేకంతో!

అదిగో అప్పుడు సుజాత గదిలోకొచ్చింది కీచకుడి దగ్గరకు వచ్చిన ద్రౌపదిలా!

అడవిఏనుగు దగ్గరకొచ్చే హంసలా అగ్నిలో దూకే సీతలా!

నరసింహం చూశాడు. లేవబోయాడు రమ్మని పిలవబోయాడు! యింకేవేవో చెయ్యాలనుకున్నాడు.

ఏదీ చెయ్యలా!

చెయ్యలేకపోయాడు.

నరసింహానికి పక్షవాతం వచ్చింది.

*　　　*　　　*

సుజాతకు ఉద్యోగం రాలేదు. వస్తుందన్న ఆశకూడా లేదు. వయస్సు మీరటం వల్ల.

నరసింహానికి అన్నీ మంచంలోనే.

సింహంలాంటి మనిషి చిట్టెలుకలాగా మంచంలో పడ్డాడు.

చేసిన పాపమా ?

చేసుకున్న పూజలఫలమా ?

"నాఖర్మ" అంటుంది సుభద్రమ్మ

"నాఖర్మ" అనే అంటుంది సుజాత కూడా! అనుకుని, "దేవుడా! నాకు మరో నరసింహాన్ని చూపు! బలి ఇచ్చుకుంటాను. నాకీ శీలం వద్దు! ఉద్యోగం ఇప్పించు" అని ప్రార్థిస్తూవుంది.

సర్వేజనాః సుఖినోభవతు.

రాక్షసులు, నరరూపభక్షకులు

పతివ్రతలు, పతితవ్రతలు

భక్తులు, పరాన్నభుక్కులు

నాయకులు, వినాయకులు

అందరూ క్షేమంగా వున్నారు, ఒక్క సుజాత, అలాంటి అనాధలూతప్ప-